నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | నల్లగొండ, శుక్రవారం 9 మే 2025 | YADADRI BHUVANAGIRI


## సూర్యాపేటలో విస్తృత తనిఖీలు

### దేశ భద్రతకు వ్యతిరేకంగా మాట్లాడొద్దు : ఎస్పీ



సూర్యాపేట బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీలు

సూర్యాపేట టౌన్, మే 8 : దేశ సరిహద్దుల వెంట ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు దృష్ట్యా జిల్లాలో పౌరుల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో ముందస్తు భద్రతా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ నరసింహ అన్నారు. అందులో భాగంగా జిల్లా సెక్యూరిటీ సిబ్బంది డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది బస్టాండ్లు, జాతీయ రహదారి, ఫ్లైఓవర్లు, వ్యాపార సముదాయాలు, ముఖ్య కూడళ్ల వద్ద తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సిబ్బందిని అప్రమత్తం చేశామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులకు సెలవులు రద్దు చేసి 24గంటలు విధుల్లో ఉండేలా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అనుచిత పోస్టింగ్స్ పెట్టవద్దని, అనుచిత వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## కాంగ్రెస్‌వి కక్ష సాధింపు చర్యలు

- మోసం చేసినందుకు ప్రజలే గుణపాఠం చెబుతారు
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- బీఆర్ఎస్ హయాంలో చేసిన శంకుస్థాపన శిలాఫలకాల ధ్వంసంపై నిరసన ర్యాలీ

మునుగోడు, మే8 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేయాలని చూస్తున్నదని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన శిలా ఫలకాలను కూలగొట్టడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా ఉప ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను నేడు కొనసాగిస్తూ వాటి మంజూరు గుర్తులు మాత్రం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. శంకుస్థాపన చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసి అదే స్థానంలో నూతన శిలాఫలకాలను కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేయడం కర్టెక్కాదని మండిపడ్డారు. మండల కేంద్రంలో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే ఏ నాడూ పట్టించుకోలేదని, తాను ఆ క్యాంప్ కార్యాలయాన్ని దగ్గర ఉండి పూర్తి చేసిన తర్వాత నాలుగు నెలలు క్యాంప్ ఆఫీస్ నుంచి ప్రభుత్వ కార్యాక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఉప ఎన్నికల ముందు కార్యాలయాన్ని పట్టించుకోని ప్రస్తుతం ఎమ్మెల్యే తన సొంత నిధులు కోటి రూపాయాలతో వెలివేషన్ చేయించున్నట్లు చెప్తున్నారని అన్నారు. బిల్డింగ్ నిర్మాణానికి మొత్తం ఖర్చు కోటి రూపాయులు అవుతున్నదని, అలాంటిది వెలివేషన్‌కు కోటి రూపాయులు ఖర్చు పెట్టారా? గత ప్రభుత్వ నిధులతో నిర్మించిన క్యాంపు కార్యాలయాన్ని పునాదుల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మించి ఇచ్చినట్లు ప్రస్తుతం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చెప్పడం భావ్యం కాదని తెలిపారు. పేరుకు మాత్రమే తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నానని ప్రజలను నమ్మిస్తున్నారని ఆరోపించారు. గత నెలలో ఉదయం సముద్రం ప్రాజెక్టు నుంచి మండల పరిధిలోని పులిపలుపుల చెరువులోకి తన సొంత నిధులతో కాల్వలు తవ్వించి నీళ్లు తీసుకొస్తున్నానని చెప్పారని, డ్రమ్ములకొద్ది పాలతో పాలాభిషేకాలు చేయించుకున్నారని, కానీ ఆ చెరువులోకి డ్రమ్ములు నిండే నీళ్లు రాలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందేలా పనిచేసిందని, రైతులకు వెన్నెముకగా నిలిచిందని చెప్పారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, తగిన సమయం చూసుకుని జనమే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ 16నెలల కాలంలో కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ లేదని, పాత వాటికే కొత్తగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ ప్రజలను తప్పుదో పట్టిస్తున్నారని అన్నారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి మీద ఉన్న సోయి నియోజకవర్గం అభివృద్ధి మీద లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మందుల సత్యం, నాయకులు పగిళ్ల సతీశ్, ఈద శరత్‌బాబు, పోలగోని సైదులు, మారగోని అంజయ్య, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పూల వెంకన్న, దోటి కరుణాకర్, ఐతగోని విజయ్‌కుమార్,జంగలి సాంబయ్య, యడవల్లి సురేశ్, పందుల సురేశ్, శివార్ల వెంకన్న, బొమ్మగోని లింగస్వామి, జనగాం అంజయ్య, వరగంటి శంకర్, బోయపర్తి సురేందర్, సైదులు, సురగి రవి, దెంద మల్లేశ్, గుర్రాల సురేశ్, గజ్జెల బాలరాజు, బోయలింగస్వామి, ఏరుకొండ శ్రీను, బొజ్జ శ్రీను, వనం లింగయ్య, కట్కూరి శంకర్, నకిరెకంటి సైదులు, మురళి, నర్సింహ, యాదయ్య, దోటి రమేశ్, హనుమంతు, రమాశంకర్, జక్కల శ్రీశైలం,సింగం సైదులు, పెంబళ్ల శంకర్, దొమ్మాటి శ్రీను, రెవెల్లి సైదులు, పెరమాళ్ల ప్రణయ్‌కుమార్, బండారు శ్రీను, వట్టికోటి నర్సింహ, బొల్లం సైదులు, మారేశ్, బొల్లం వీరేశం తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ సింధూర్.. సర్వత్రా సంతోషం

## ఉమ్మడి జిల్లా అంతటా హర్షాతిరేకాలు

- కులమతాలకు అతీతంగా సంపూర్ణ మద్దతు
- సోషల్‌మీడియా వేదికగా సైన్యానికి జేజేలు
- పలుచోట్ల పాక్‌పై మెరుపు దాడుల పట్ల సంబురాలు
- ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి అంటూ సంఘీభావం
- పాకిస్థాన్ ఉగ్రచర్యలకు బుద్ధి చెప్పి తీరాల్సిందేనంటున్న జనం



రాజాపేటలో ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ ప్రతినిధి, మే8(నమస్తే తెలంగాణ) : పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మన సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌తో ప్రతి భారతీయుడి హృదయం ఉప్పొంగింది. ఉగ్రవాదాన్ని భారత్‌పైకి ఎగదోస్తున్న పాకిస్థాన్‌కు సరైన సమయంలో సరైన రీతిలో బుద్ధి చెప్పడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ సైన్యం దాడి విషయం తెలిసిన ప్రజలు సంతోషంలో మునిగితేలారు. పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులతో ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నావీ బలగాలను ఉమ్మడి జిల్లా యావత్ ప్రజానీకం అభినందనలతో ముంచెత్తుతున్నది. ఈ రెండు రోజులుగా ఎక్క డా చూసినా... ఏ ఇద్దరూ కలిసినా.. ఆపరేషన్ సింధూర్‌పైనే ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. భవిష్యత్తులోనూ పాకిస్థాన్, అది ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదం భారత్ వైపు కన్నెత్తి చూసేందుకు వణుకుపుట్టేలా భారత్ చర్యలు ఉండాలని, ఆ దిశగా ప్రజలందరి మద్దతు ఉంటుందన్న సంఘీభావం సర్వత్రా వ్యక్తమవుతున్నది. భారత సైన్యం ప్రతి భాపాటవాలు, సత్తా, అత్యాధునిక రక్షణ వ్యవస్థ పట్ల ప్రతి ఇంటా చర్చ జరుగుతున్నది. ప్రధాన మీడియా స్రవంతితో పాటు సోషల్‌మీడియా మొత్తం పాకిస్థాన్ ఉగ్రమూలాలపై భారత్ సైన్యం చేసిన మెరుపు దాడుల వార్తలతోనే నిండిపోయింది. కులమతాలు, ప్రాంతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భారత్ సైనిక దాడులను కీర్తిస్తూ సోషల్‌మీడియాలో స్టేటస్‌లు పెట్టుకుంటూ, సంబంధిత వీడియోలను, వార్తలను షేర్లమీద షేర్లు చేస్తూ తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇక భారత్ ఆపరేషన్ సింధూర్‌ను జీర్ణించుకోలేని పాకిస్థాన్ ప్రతీకార దాడులతో సైన్యం కవ్వింపు చర్యలకు భారత్ ఆర్మీ దీటుగా బదులివ్వడం, దానికి అనుగుణంగా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమన్న సంకేతాలు సోషల్‌మీడియా వేదికగా జనం నుంచి లభిస్తున్న సంఘీభావం విశేషంగా మారింది.

పహల్గామ్ ఉగ్రదాడుల అనంతరం పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం, దానికి మద్దతునిస్తున్న పాకిస్థాన్ తీరుపై ప్రతి ఒక్కరూ తీవ్రంగా రగిలిపోతున్నారు. ఆహ్లాదం కోసం ఏ పాపం తెల్వని పర్యాటకులు స్వేచ్ఛగా విహరిస్తుండగా కాల్పులు జరిపి 26 మందిని పొట్టన పెట్టుకోవడం ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. దీంతో తప్పకుండా పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పి తీరాల్సిందేనన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమైంది. పార్టీలకు అతీతంగా ఈ విషయంలో భారత్ ప్రభుత్వానికి మద్దతు లభించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగానూ ఫహల్గామ్ దాడులపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబాలకు సంఘీభావం ప్రకటిస్తూ వాడవాడలా కొవ్వొత్తుల ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ఇందులో కదం తొక్కారు. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌కు, దాని ఉగ్రవాద చర్యలకు చెక్ పెట్టాల్సిందేనన్న బలమైన వాదన వ్యక్తమైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ కేంద్రంగా చేసుకుని ఉగ్రవాద సంస్థలు దుశ్చర్యలకు దీటుగా బదులివ్వాల్సిందేనని ముక్తకంఠంగా జనం నినదించారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం అన్ని వర్గాలతో చర్చలు జరుపుతూనే వ్యూహాత్మకంగా పాకిస్థాన్‌పై దాడులకు తెరలేపింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై గురితప్పకుండా దాడులు జరపడం, నిర్దేంచుకున్న లక్ష్యాలను ఛేదించి సురక్షితంగా భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పట్ల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల భారత్ ఆపరేషన్ సింధూర్ పట్ల ప్రజలు రోడ్లపైకి వచ్చి సంబరాలు జరుపుకుంటున్నారు. భారత్ ఆపరేషన్ సింధూర్‌పై హర్షం వ్యక్తం చేస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. గురువారం రాజపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. కోదాడలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ సైన్యం చేస్తున్న పోరాటం అసమాన్యమైనదని, త్రివిధ దళాల సాహసాలకు భారత్ దేశం యావత్తు గర్విస్తుందన్నారు. పాకిస్థాన్‌పై దాడులు విజయవంతం అవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇక నకిరేకల్‌లో ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ త్రిపాఠీ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఇక పలుచోట్ల అపార్ట్‌మెంట్లల్లోనూ, పలు సంస్థల్లోనూ ఆపరేషన్ సింధూర్ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సంబురాలు జరిపారు. పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పి తీరాల్సిందేనని, దాని ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు భారత్ ఆపరేషన్ కొనసాగాల్సిందేనని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఆర్మీ రిటైర్డ్ అధికారులు, మాజీ సైనికులు, ప్రస్తుత ఆర్మీలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న వారి కుటుంబ సభ్యులు స్పష్టం చేస్తున్నారు. పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన వ్యూహాత్మక ఆపరేషన్ సింధూర్ పూర్తి స్థాయిలో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నారు. భారత్ సైన్యానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఇలాంటి పరిస్థితుల్లో దేశం యావత్తు ఒక్కటిగా సంఘీభావం ప్రకటించడం దేశ సమైఖ్యతకు, సమగ్రతకు నిదర్శనమని సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.



నల్లగొండలో జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్న మహిళలు



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

## ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

సూర్యాపేట, మే 8 : ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతు గురువారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో నేటికీ పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు, లారీల కొరత కారణంగా కొనుగోలులో జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ఇటీవల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, వెంటనే ప్రభుత్వ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో ధాన్యంలో కోత విధించడాన్ని అడ్డుకోవాలని, అందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి దండ వెంకట్‌రెడ్డి, కందాల శంకర్‌రెడ్డి, దేవరం వెంకట్‌రెడ్డి, కొప్పుల రజిత, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, పళ్ల సుదర్శన్, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, మండడి రాంరెడ్డి పాల్గొన్నారు.



భువనగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతి

భువనగిరి అర్బన్, మే 8 : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో దరఖాస్తులు చేసుకున్న అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కొండల్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం ఇండ్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీ సభ్యులు అని, కాంగ్రెస్ కార్యకర్తలను పెట్టి వారు నిర్ణయించిన పేర్లనే ఫైనల్ చేయడంతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. వీటి మీద ఎంక్వయిరీ చేసి అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు గత ప్రభుత్వంలో నెలవారీగా జీతాలు అందేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో గత రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు ఖాజా అజీముద్దీన్, దిడ్డికాడి భగత్, తుమ్మల పాండు, తాడూరు భిక్షపతి, తాడేం రాజశేఖర్, వెల్దుర్తి రఘునందన్, ఎనబోయిన జహంగీర్, బర్రె రమేశ్, కాజం, అంజద్, రహీం, సురేశ్, నాగరాజు, సత్యనారాయణ, ప్రవీణ్, మనీష్, ఆకాశ్, గణేశ్, నరసింహారెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

## ఎయిమ్స్ డైరెక్టర్‌గా అహెంతం సంతసింగ్ బాధ్యతల స్వీకరణ

బీబీనగర్, మే 8 : మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా అహెంతం సంతసింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరి ఎయిమ్స్‌లో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బీబీనగర్ ఎయిమ్స్‌లో ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేసిన డైరెక్టర్ వికాస్ భాటియా భువనేశ్వర్ ఎయిమ్స్‌కు వెళ్లారు.



డాక్టర్ అహెంతం సంతసింగ్

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఏదీ..?

### పత్తాలేని వ్యవసాయ కూలీలకు సాయం

- అందని ద్రాక్షగానే తొలి విడుత రూ. 6వేలు
- జిల్లాలో 17 దత్తత గ్రామాలకే పరిమితం
- అర్హుల జాబితా పేరుతో మాత్రం హడావుడి..
- లబ్ధిదారులను గుర్తించినా డబ్బుల జమ ఏదీ..?



**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారులకు అందని ద్రాక్షగానే మారింది. ప్రభుత్వ ప్రచార ఆర్భాటాలే తప్ప.. ఫలాలు మాత్రం అందడం లేదు. మండలానికో గ్రామం దత్తత పేరుతో ఒక్క శాతం కూడా అమలు చేయకుండా చేతులు దులుపుకొన్నది. అర్హుల జాబితా పేరుతో హడావుడి చేసి అటకెక్కించింది.**

**- యాదాద్రి భువనగిరి, మే 8 (నమస్తే తెలంగాణ)**

భూమిలేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పెట్టింది. ఇందులో భాగంగా కూలీలకు ప్రతి సంవత్సరం రూ. 12వేల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు విడుతల్లో సాయం అందనుంది. ఈ పథకానికి భూమి లేని వ్యవసాయ కూలీలు అర్హులుగా నిర్ణయించారు.


### 17గ్రామాలకే పరిమితం..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా అంతటా ఒకేసారి అమలు చేయాలని నిర్ణయించారు. కానీ ప్రభుత్వం పలు కారణాలతో పథకాన్ని కుదించారు. మండలానికో గ్రామం దత్తత అంటూ సర్కార్ కాలయాపన చేసే ప్రయత్నం చేసింది. దీంతో జిల్లాలోని 17 మండలాల్లో 17 గ్రామాలను హడావుడిగా ఎంపిక చేశారు. అవి కూడా చిన్న గ్రామాలను సెలెక్ట్ చేసుకున్నారు. మొత్తంగా ఇప్పటి వరకు 324 మందికి మాత్రమే రూ. 6వేల చొప్పున సాయం అందించి చేతులు దులుపుకొంది. అంటే జిల్లాలో 421 గ్రామాలు ఉండగా, కేవలం 17 పల్లెలకే పరిమితం చేశారు.

### అర్హుల జాబితా పేరుతో హడావుడి..

పథకం అమలులో జాప్యంతో ప్రజల నుంచి వ్యతిరేకతను తప్పించుకునేందుకు సర్కార్ కొత్త ఎత్తుగడను ఎత్తుకుంది. లబ్ధిదారుల ఎంపిక పేరుతో తాత్సారం చేసింది. vఅర్హుల ఎంపిక కోసం ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డుల ఆధారంగా వివరాలు సేకరించింది. ఫీల్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఈ ప్రక్రియను చేపట్టారు. మండల కంప్యూటర్ సెంటర్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమాచారాన్ని క్రోడీకరించారు. జిల్లాలో మొత్తంగా 10,517 మందిని అర్హులుగా తేల్చారు.


### నిధుల లేమీతోనే..?



కాంగ్రెస్ వ్యవస్థాపక దినమైన డిసెంబర్ 28 తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో తొలి విడుత రూ. ఆరు వేల వేస్తామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. నాలుగు నెలలు దాటినా ఇప్పటి వరకు దత్తత గ్రామాలు మినహా మిగతా చోట్ల పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, అందుకే పథకం ఆమలు ఆలస్యం అవుతున్నదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని వ్యవసాయ కూలీలు కోరుతున్నారు.

## ఎంజీయూ డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

- ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న ఎగ్జామ్స్



ఎంజీయూ డిగ్రీ పరీక్షల నూతన షెడ్యూల్ విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఓఈ

రామగిరి, మే 8 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో గత నెలలో జరుగాల్సిన డిగ్రీ పలు సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేసిన విషయం విదితమే. ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో అప్పులు చేసి కళాశాలలను నిర్వహించలేని ఆయా కళాశాలల యాజమాన్యాలు పరీక్షలను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం నుంచి స్పష్టతరానప్పటికీ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఎంజీయూ అధికారులు ఈ నెల 14 నుంచి పరీక్షల నిర్వహణకు గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. షెడ్యూల్ విడుదలతో ఫైనల్ ఇయర్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కళాశాలల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పరీక్షలు నిర్వహించలేం

- టీపీడీపీఎంఏ ఎంజీయూ చాప్టర్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి

ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నాయని తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) ఎంజీయూ చాప్టర్ అధ్యక్షుడు, నీలగిరి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నెలలుగా అధ్యాపకుల వేతనాలు, భవనాల అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేస్తేనే ఈ నెల 14 నుంచి యూనివర్సిటీ విడుదల షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని, లేని పరిస్థితిలో తమ నిరసనను కొనసాగిస్తామని తెలిపారు.